
హైదరాబాద్ వార్త

# శరవేగంగా పూడికతీత పనులు..



- వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా హైడ్రా చర్యలు
- నాలా, మ్యాన్‌హోల్స్, కల్వర్టులల్లో చెత్త తొలగింపు
- 20 రోజుల్లో 1570 ట్రక్కుల పూడిక తీసివేత



**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** నగరంలో నాలాల పరిస్థితి బిఫోర్ -ఆఫ్టర్ లా మారింది. హైడ్రా రంగంలోకి దిగడంతో నాలాల్లో, కల్వర్టుల వద్ద పూడికతీత పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీంలు, డిఆర్ఎఫ్ బృందాలు సంయుక్త ఆధ్వర్యంలో కల్వర్టులు క్లియర్ అవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, థర్మోకోల్, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించడంతో పూడుకు పోయిన నాలాలు, కల్వర్టులు తెరుచుకున్నాయి. లారీలకొద్దీ చెత్తను తొలగించడంతో వరద సాఫీగా వెళ్లేందుకు మార్గం సుగమం చేస్తున్నారు. తొలగించిన చెత్తను వెంటనే ఆపరిసరాల్లోంచి తరలించడంతో నివాసితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీంలు, హైడ్రా డిఆర్ఎస్ బృందాలు సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ నాలా, కల్వర్టుల క్లీనింగ్ పనులు మొదలయ్యాయి. పరిధిలో మొత్తం నాళాలను, కల్వర్టులను, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలను ఈ బృందాలు జల్లెడ పట్టాయి. జిహెచ్ఎంసి , జలమండలి సహకారంతో నాలాలు, కల్వర్టుల క్లీనింగ్ పనులను ముమ్మరం చేశాయి. వర్షం పడినప్పుడు వరద నీరు నిలబడకుండా, రోడ్లపై ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా పర్యవేక్షించే బృందాలు... వర్షం లేని ఖాళీ సమయాన్ని నాళాలు, కల్వర్టులు, మ్యాన్ హోల్స్ క్లియర్ చేసే పనుల్లో నిమగ్నమయ్యాయి. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో సర్కిళ్లవారీ ఈ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. మురుగు, వరద నీరు ముందుకు కదలకుండా ఉక్కిరిబిక్కిరి అయిన నాళాలు, కల్వర్టులు హమ్మయ్య అని సేదదీరుతున్నాయి. కాలువ పరిసరాల్లో నివాసముంటున్న ప్రజలు కూడా ఊపిరి పీల్చుకుంటున్నారు. కాలువల్లో నీరు సాఫీగా సాగిపోవడాన్ని చూసి హమ్మయ్య అనుకుంటున్నారు.

**20 రోజుల్లో 1570 ట్రక్కులు..**

నగర వ్యాప్తంగా హైడ్రా పెద్దయెత్తున పూడిక తీసే పనులు ప్రారంభించి కొనసాగిస్తోంది. ఇలా జూన్ 22 వ తేదీ నుంచి జులై 11 వ తేదీ వరకూ మొత్తం 1570 ట్రక్కుల పూడికను హైడ్రా తొలగించింది. మ్యాన్‌హోల్స్, కల్వర్టులవద్ద పేరుకుపోయిన పూడికతో పాటు ప్రవాహానికి అడ్డుగా ఉంటుందనే ఉద్దేశంతో నాలాల్లో పూడికను కూడా హైడ్రా తొలగిస్తోంది. నగరవ్యాప్తంగా అనేక కాలనీల్లో నాలాల్లో పూడిక తీయడంతో మురుగు నీరు కూడా సాఫీగా సాగుతోంది. దీంతో మురుగు పోటెత్తే పరిస్థితులు కూడా నగరంలో చాలావరకు తగ్గాయని నగర ప్రజలు చెబుతున్నారు.

## కాలువల్లో చెత్త వేయవద్దు

**:ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్**

ఇంట్లో పనికిరాని వస్తువులన్నీ వరద, మురుగు కాలువల్లోకి వెళ్తున్నాయి. దీంతో వరద ప్రవాహానికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వర్షం పడినప్పుడు వరద కాలువల్లో వరద సాఫీగా సాగక కాలనీలను, రహదారులను ముంచెత్తుతున్నాయి. నాలాల్లో చెత్త వేయవద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగర వ్యాప్తంగా ఎక్కడ చెత్త తీసినా టన్నులకొద్దీ చెత్త బయట పడుతోంది. ప్రజలు ఈ విషయంలో దృష్టి సారించి చెత్తను కాలువల్లో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటోలను వినియోగించుకోవాలని సూచించారు. లేని పక్షంలో చెత్త కుండీల్లో చెత్తను వేయాలన్నారు.

# బోనాల ఉత్సవాలపై సిటీ కొత్వాల్ సమీక్ష

**- వేడుకలు సాఫీగా జరగాలని ఆదేశం**


వీడియోకా న్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కొత్వాల్ సజ్జనార్ చిత్రంలో శాంతి భద్రతల అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** జంట నగరాలలో గురువారం నుంచి మొదలుకానున్న బోనాల వేడుకల ఏర్పాట్లపై సిటీ కొత్వాల్ సజ్జన్నర్ మంగళవారం నగర పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలు ప్రతిష్ఠాత్మకంగా జరుపుకొనే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఈ నెల 16 నుంచి ఆగస్టు 13 వరకు కొనసాగే ఈ ఉత్సవాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా చూడాలని ఆయన ఆదేశించారు. బోనాల ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో తీ సుకుంటున్న భద్రతా చర్యలను ఈ సందర్భంగా అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు.గోల్కొండ బోనాలతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు, అలియాబాద్ అమ్మవారి బోనాల ఉత్సవాలతో ముగుస్తాయని, అయితే మొదటి 15 రోజులు అత్యంత కీలకమని ఆయన తెలిపారు. ఆయా ఆలయాల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. బోనాల ఏర్పాట్లపై మంత్రులు కొండా సురేఖ. పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశాలు నిర్వహించి చేసిన సూచనలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో భక్తులందరూ అమ్మవార్లను ప్రశాంతంగా దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వేడుకల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా టాస్క్‌ఫోర్స్‌తో పాటు ఇతర విభాగాల సిబ్బంది నిరంతరం పక్కాగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు భక్తులకు అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా ఆలయాల పరిసరాల్లో మైకులను ఏర్పాటు చేయాలని కమిషనర్ తెలిపారు. ఈ ఉత్సవాలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, వారి భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, ఎక్క డా ఎవరూ ఇబ్బందులకు గురికాకుండా చూడాలని ఆయన సూచించారు. గత ఉత్సవాల్లో మహిళలను వేధించిన 644 మంది ఆకతాయిలను పట్టుకున్నారని, ఈసారి ఇలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇందుకు షీ టీమ్స్ ద్వారా నిరంతర నిఘా కొనసాగి ంచాలని ఆయన కోరారు. అమ్మవార్ల దేవాలయాల పరిసరాల్లో భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపు వంటి క్రతువులు శాంతియుతంగా సాగేలా తగినంత మంది సిబ్బందిని రంగంలోకి దించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో శాంతి భద్రతల అదనపు పోలీసు కమిషనర్ తఫ్షీర్ ఇక్బాల్, పరిపాలన విభాగం డిసిపి వెంకటలక్ష్మి, ఎస్‌బి అదనపు డిసిపి నర్సింహారావు కమాండ్ కంట్రోల్ నుంచి పాల్గొనగా క్రైం అండ్ సిట్ అదనపు పోలీసు కమిషనర్ శ్రీనివాసులు, ట్రాఫిక్ చీఫ్ జోయల్ డేవిసఖ సహా ఆయ జోన్ల డిసిపిలతో పా టు ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

# గోల్కొండ బోనాలకు పకడ్బందీ ఏర్పాట్లు

**-భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు : జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా**


గోల్కొండ కోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** గోల్కొండ బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు. ప్రభుత్వం బోనాల ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున ఏర్పాట్లు ఆ దిశగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈమేరకు మంగళవారం గోల్కొండ కోటలోని జగదాంబ మహంకాళి దేవాలయం వద్ద బోనాల ఉత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కోట పరిసరాల్లో కాలినడకన పర్యటిస్తూ భక్తుల రాకపోకలు, క్యూలైన్లు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా, భద్రత తదితర ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. జూలై 16వ తేదీ గురువారం తొలి పూజతో తొలి బోనం ఊరేగింపు, మంత్రులు, ప్రముఖులచే పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమాలు జరుగనున్నాయని అనంతరం ఆగస్టు 13వ తేదీ వరకు ప్రతి గురువారం, ఆదివారం బోనాల ఉత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, క్యూలైన్ల నిర్వహణతో పాటు అవసరమైన స్టేజింగ్ ఏర్పాట్లు చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన ప్రాంతాల్లో బయో టాయిలెట్లను ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. భక్తులు అధికంగా ఉండే ముఖ్య ప్రాంతాల్లో తగినంత స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలని జలమండలి అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ లైన్లు, వైరింగ్‌ను ముందుగానే క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపాలను సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అత్యవసర విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు వాటర్‌ప్రూఫ్, సౌండ్‌ప్రూఫ్ జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా పటిష్టమైన నిఘా, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సీసీ కెమెరాల నిఘాను పటిష్టం చేయాలని సూచించారు. షీ టీమ్స్‌ను మోహరించడంతో పాటు అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. వృద్ధుల సౌకర్యార్థం ఎలక్ట్రిక్ బగ్గీని అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.అనంతరం లంగర్‌హౌజ్‌లో బోనం ఊరేగింపు ప్రారంభమయ్యే ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ పర్యటనలో హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫియాజ్, విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ కరుణాకర్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వినోద్, గోల్కొండ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, దేవాలయ ఈఓ వసంత, పురావస్తు పరిరక్షణ అధికారి మల్లేష్, జీహెచ్ఎంసీ, జలమండలి, టీజీఎస్పీడీసీఎల్, ఆర్ అండ్ బీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత కోసం ప్రత్యేక దృష్టి

**-భద్రతా బలోపేతం కోసమే సహచరి**
**-మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి**


సికింద్రాబాద్‌లో జరిగిన మీ సురక్ష సహచరి సదస్సులో ప్రసంగిస్తున్న మల్కాజిగిరి సీపీ సుమతి

**ఎల్.బి.నగర్, జూలై 14 ప్రభాతవార్త:** సమర్థవంతమైన పోలీసులకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పేర్కొన్నారు. మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో సహచరి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా పోలీస్ ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే వినూత్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని మంగళవారం నాగోల్ శుభం కన్వెన్షన్ సెంటర్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు ఎలాంటి భయాందోళనలు లేకుండా పోలీసులను సంప్రదించాలని తమ సమస్యలను బహిరంగంగా తెలియజేయాలని సూచించారు. సహచరి కార్యక్రమం ద్వారా కాలనీలు బస్తీల స్థాయిలో బలమైన సమాచార వ్యవస్థ ఏర్పడి నేరాలను సకాలంలో గుర్తించి మహిళలు పిల్లల భద్రతను మరింత బలోపేతం చేయడం పోలీస్ ప్రజల మధ్య విశ్వాసాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు. మీప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్ ప్రతినెల జరిగే సమావేశాల్లో భద్రతకు సంబంధించిన అంశాలను చర్చించి ఈ కార్యక్రమంలో ద్వారా పొందిన అవగాహనను ఇతర మహిళలకు కూడా చేరవేయాలని సూచించారు. మహిళలు సమాజంలో భద్రతపై అవగాహన పెంచుకోవడం నేరాలపై సకాలంలో సమాచారం అందించడం, మహిళలు, పిల్లల రక్షణకు తోడ్పడడం, సురక్షిత కుటుంబాలు, కాలనీలు, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. మహిళలకు చట్టబడమైన హక్కులు, వ్యక్తిగత భద్రత, పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు, సైబర్ క్రైమ్ నివారణ, ఆంటీ డ్రగ్ అవేర్నెస్, ఎమర్జెన్సీ రెస్పాన్స్, పలు చట్టాలు, ఉమెన్ పోలీస్‌స్టేషన్ తదితర అంశాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి డిసి పి సిహెచ్.శ్రీధర్, ట్రాఫిక్ డిసిపి రాహుల్‌రెడ్డి, ఉప్పల్ డిసిపి కె.సురేష్ కుమార్, ఎల్బీనగర్ డిసిపి బి.అనురాధ, మహిళా విభాగం డిసిపి టి.ఉషారాణి, ఎస్ఓటి డీజీపీ ఏ.లక్ష్మి, అదనపు డీసీపీలు, ఏసీబీలు, ఎస్‌హెచ్ఓలు, మీప్మా తదితరుల అధికారులు పాల్గొన్నారు.

**సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్‌లో**

మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టిపెట్టిందని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్త అధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్‌లో నిర్వహించిన మీ సురక్ష సహచరి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులను సంప్రదించాలన్నారు. మెగ్మాసర్ప్ విభాగాల మహిళా గ్రూప్‌లకు ఎల్లప్పుడు తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికై 'ప్రతిరోజు ఒకవార్డు'


స్థానికులతో మాట్లాడుతున్న సిఎంసి కమిషనర్ జి.సృజన

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ప్రతి రోజు ఒక వార్డు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఎంసి కమిషనర్ జి.సృజన తెలిపారు. ఈమేరకు సోమవారం జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ వివిధ విభాగాల అధికారులతో కలిసి కూకట్‌పల్లి జోన్, మాదాపూర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్ వార్డును.. సందర్శించి పౌర సమస్యలను సమీక్షించారు. సిలికాన్ వ్యాలీ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు, స్థానిక ప్రజలతో కమిషనర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ప్రస్తావించిన మౌలిక వసతులకు సంబంధించిన వివిధ అంశాలను సమీక్షించారు. బోర్‌వెల్ మరమ్మతులు, యూజీడీ నెట్‌వర్క్ అప్‌గ్రేడేషన్, నీటి సరఫరా, తక్కువ నీటి ఒత్తిడి, ట్యాంకర్ సేవలకు సంబంధించిన సమస్యలు, రహదారి మరమ్మతులు, అభివృద్ధి పనుల కారణంగా ఏర్పడిన వ్యర్థాలు, శిథిలాల తొలగింపు, ఆక్రమణల తొలగింపు, అక్రమ పార్కింగ్‌పై చర్యలు, ఓపెన్ జిమ్‌లు, చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటు పార్కుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ట్రాఫిక్ సమస్యలు, పార్కుల పరిసరాల్లో పెట్రోలింగ్ పెంపు, చెట్ల కొమ్మల కత్తిరింపు వల్ల ఏర్పడే గ్రీన్ వేస్ట్‌ను సకాలంలో తొలగించడం, సీఎన్ తండా శ్మశానవాటిక సమస్యలు, చెత్త వేయడం మరియు వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు పాటించని వారిపై చర్య లు, హాస్టళ్లలో నీటి వినియోగం మరియు వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై కూడా చర్చించారు.ప్రజలు ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి, ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. అవసరమైన అంశాల్లో సంబంధిత శాఖలు, విభాగాలతో సమన్వ యం చేసుకుని సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

## రూ.25 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా


కాపాడిన స్థలంలో ఫెన్సింగ్ వేస్తున్న హైడ్రా సిబ్బంది

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం, బోడుప్పల్ మున్సిపాలిటీ, చెంగిచెర్ల విలేజ్‌లోని జయప్రద కాలనీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన 4400 గజాలను హైడ్రా కాపాడింది. ఇందులో పార్కు కోసం కేటాయించిన 1200ల గజాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లకోసం 1200ల గజాలు, దేవాలయాలకు ఉద్దేశించిన 400ల గజాలు, పాఠశాలతో పాటు గ్రంథాలయానికి కేటాయించిన 800ల గజాలు, వాటర్ ట్యాంక్ కోసం కేటాయించిన 800ల గజాలు స్థలాలు ఇందులో ఉన్నాయి. షాపింగ్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన స్థలాన్ని ఇంటి స్థలాలుగా మార్చేయడం పట్ల జయప్రద కాలనీ నివాసితులు ఆందోళన చెందారు. ఇలా ఇప్పటికే 2 ఇళ్లు నిర్మాణం జరిగింది.వరుసగా ఆక్రమణలు జరుగుతుండడం పట్ల జయప్రద కాలనీ వాసులు ఆం దోళన చెందారు. ఇదే విషయమై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వెనువెంటనే క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా పరిశీలించి.ఆక్రమణలను నిర్ధారించుకుంది. ఈమేరకు పార్కుతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడుతూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అలాగే హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. హైడ్రా కాపాడిన భూమి విలువ రూ. 25 కోట్ల వరకూ ఉంటుందని అంచనా..

## రీల్స్ పిచ్చితో గాంధీ ఆస్పత్రిలో బిపి మిషన్ దొంగతనం

**సికింద్రాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** కొంతమంది యువత సోషల్ మీడియా పిచ్చి, రీల్స్ మోజులో తమ వ్యూస్, లైకులు, షేర్ల కోసం ప్రాణాలమీదికి తెచ్చుకునే పనులు చేయడమే కాకుండా వాటిని సోషల్ మీడియాలో పోస్టులు చేస్తూ ఆనందాన్ని పొందుతున్నారు. తమ సరదాల కోసం ఎదుటి వారి ప్రాణాలు కూడా ప్రమాదాల వైపు నెడుతున్నారు. గాంధీ ఆస్పత్రిలో దొంగతనం చేస్తూ రీల్స్ చేసి ఇన్స్టాగ్రామ్లో పెట్టిన ఒక యువకుడి నిర్వాకం ఇపుడు వెలుగులోకి వచ్చింది. గాంధీ హాస్పిటల్ ఓ యువకుడి చోరీకి పాల్పడ్డాడు. అక్కడి రోగుల కోసం ఉపయోగించే బీపీ మిషన్‌ను గుట్టుచప్పుడు కాకుండా దొంగిలించాడు. అంతటితో ఆగకుండా ఈ చోరీ విషయాన్ని వీడియో తీసి ఇన్ స్టా గ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేశాడు. అది కాస్తా వైరల్ అవుతోంది. ఇందులో సదరు యువకుడు మాట్లాడుతూ.. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో ఉన్నాం. బీపీ చెక్ చేయమంటే చెక్ చేయడం లేదు. అందుకే ఏకంగా బీపీ మిషన్ ఎత్తుకెళ్తున్నానంటూ తెలిపాడు. చేతిలో ఓ ఎలక్ట్రానికి బీపీ ఆపరేటర్ పట్టుకుని ఆసుపత్రిలో మెట్ల మార్గంలో కిందకు దిగుతున్న దృశ్యాలు ఈ వీడియో కనిపిస్తున్నాయి. వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో దీనిపై నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. లైకులు, వ్యూస్ కోసం మరీ ఇంత బరితెగిస్తారా? ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు వైద్యం అందించే పరికరాలను ఎత్తుకెళ్లి ఇలా షోలు వేస్తారా? మండిపడుతున్నారు. ఇలాంటి వాళ్లను వదిలిపెట్టకుండా తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

# తాగునీటి సరఫరాకు సమగ్ర ప్రణాళిక

**-ట్యాంకర్ పెండెన్సీని తగ్గించాలి**
**-వర్షపు నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలి**
**-అధికారులకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశాలు**


జలమండలి ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ అశోక్‌రెడ్డి

**హైదరాబాద్ జులై 14 ప్రభాతవార్త** హైదరాబాద్ మహానగరంలో భవిష్యత్ తాగునీటి అవసరాలు, జలాశయాల్లో నీటి లభ్యత, ట్యాంకర్ నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, ఏంసీసీ ఫిర్యాదుల పరిష్కారం, సీవరేజ్ నిర్వహణ, పెండింగ్ పనులు, రెవెన్యూ వసూళ్ల తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగూర్,మంజీరా జలాశయాలకు ఆశించిన స్థాయిలో వరద ప్రవాహాలు రాని పరిస్థితి ఏర్పడితే,తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని ఎండీ ఆదేశించారు. సింగూర్ ,మంజీరా నుంచి నీటి సరఫరా అవుతున్న ప్రాంతాలలో సరఫరా తగ్గితే ఏర్పడే లోటునూ గోదావరి, కృష్ణా, మిషన్ భగీరథ తదితర వనరుల నుంచి ఎంత నీటిని మళ్లించవచ్చనే అంశాలను శాస్త్రీయంగా లెక్కించాలని సూచించారు. ప్రత్యామ్నాయ నీటి సరఫరాకు అవసరమైన ఇంటర్‌కనెక్షన్, పైప్‌లైన్లు, జంక్షన్లు, వాల్వులు, పంపింగ్ సదుపాయాలు, రిజర్వాయర్ ఇన్‌లెట్, ఔట్‌లెట్ మార్పులు, ప్రాంతాలవారీ నీటి కేటాయింపుతో కూడిన పూర్తి కంటింజెన్సీ ప్రణాళికను జులై 16లోగా సమర్పించాలని స్పష్టం చేశారు.

**మిషన్ భగీరథ అదనపు జలాల వినియోగం...**

మిషన్ భగీరథకు సంబంధించిన పనులు పూర్తయిన తర్వాత జలమండలికి అదనంగా సుమారు 25 నుంచి 30 ఎంజీడీల నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నందున, ఆ నీటిని తూర్పు హైదరాబాద్, మల్కాజిగిరి తదితర ప్రాంతాలకు సమర్థవంతంగా వినియోగించేందుకు ఇప్పటి నుంచే అవసరమైన నెట్‌వర్క్‌ను సిద్ధం చేయాలని ఎండీ ఆదేశించారు. అదనపు నీరు వచ్చిన తర్వాత పనులు ప్రారంభించకుండా, ఏ ప్రాంతానికి ఎంత నీరు ఇవ్వాలి, ఏ రిజర్వాయర్‌కు అనుసంధానించాలి, ఎక్కడ పైప్‌లైన్లు, జంక్షన్లు, వాల్వులు, పంపింగ్ ఏర్పాట్లు అవసరమో ముందుగానే ఖరారు చేయాలని సూచించారు. అలాగే మిషన్ భగీరథ నీటి వినియోగం ద్వారా కృష్ణా లేదా గోదావరి వ్యవస్థల్లో ఆదా అయ్యే నీటిని సింగూర్ మంజీరా ప్రభావిత ప్రాంతాలకు మళ్లించే అవకాశాన్ని కూడా పరిశీలించాలన్నారు. గోదావరి వ్యవస్థ నుంచి అదనంగా సుమారు 10 ఎంజీడీల నీటిని తీసుకునే సాంకేతిక సాధ్యాసాధ్యాలపై ప్రతిపాదన సిద్ధం చేయాలని ఆదేశించారు.

**రోజుకు కనీసం 11 వేల ట్యాంకర్ ట్రిప్పులు...**

నగరంలో ట్యాంకర్ బుకింగ్‌ల పెండెన్సీని తగ్గించేందుకు రోజుకు కనీసం 11 వేల ట్యాంకర్ ట్రిప్పులు డెలివరీ చేయాలని ఎండీ ఆదేశించారు. రోజువారీగా నమోదయ్యే కొత్త బుకింగ్‌లను పూర్తి చేయడంతో పాటు పాత పెండెన్సీని కూడా అదనపు ట్రిప్పుల ద్వారా తగ్గించాలని సూచించారు. జలమండలి పరిధిలో మొత్తం 95 ఫిల్లింగ్ స్టేషన్‌లు ఉండగా బోడుప్పల్, షాపూర్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, కొత్తపేట, గాజులరామారం, పీర్జాదిగూడ, మంగాపురం తదితర ప్రాంతాలలో కొంత మేరకు పెండెన్సీ ఉందని ఈ ప్రాంతాల్లో ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ఈ పెండెన్సీ ఉన్న ఫిల్లింగ్ స్టేషన్లు, డివిజన్లకు అదనపు ట్యాంకర్లు, డ్రైవర్లు, రాత్రి షిఫ్టులు, అదనపు ఫైలింగ్ పాయింట్లు, సమీప స్టేషన్ల నుంచి వాహనాల మ్యాపింగ్, అవసరమైన నీటి కేటాయింపులతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పంకజ, సంతోష్, డైరెక్టర్లు సుదర్శన్, నారాయణ, వాస సత్యనారాయణ, పాల్గొన్నారు.

## టీజి బిసి స్టడీసర్కిల్‌లో సివిల్ సర్వీసెస్‌కు ఉచిత కోచింగ్

**నాంపల్లి, జులై 14 ప్రభాతవార్త :** 2026-27 సంవత్సరానికి హైదరాబాద్‌లోని టీజి బిసి స్టడీసర్కిల్‌లో యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ (ప్రిలిమనరీ-కమ్-మెయిన్స్)కు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు స్టడీసర్కిల్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. 10 నెలల కాలపరిమితి గత ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమంలో ప్రవేశం కోసం, 16-8-2026న నిర్వహించబడి ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నందున తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిసి (బిసి-ఇ మరియు దివ్యాంగులతోసహా), ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి ఏదైనా డిగ్రీ లేదా ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రే.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షలలోపు ఉండాలి. అభ్యర్థులు నిరుద్యోగులై ఉండాలి. సవివర ప్రకటన టీజి బిసి స్టడీసర్కిల్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.టీజీబిసిస్టడీసర్కిల్.సిజిజి.జిఓవి.ఇన్ లో అందుబాటులో ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తులను 17-07-2026 నుండి 07-08-2026 వరకు సమర్పించవచ్చునని డైరెక్టర్ టీజీబిసి స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆ ప్రకటనలో తెలిపారు.

## తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న శివారెడ్డి, వేణుగోపాల్, నరహరి, చంద్రశేఖర్‌రెడ్డి, రామమూర్తి తదితర అతిథులు

**నాంపల్లి, జులై 13 ప్రభాతవార్త :** బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు గ్రంథావిష్కరణ వైభవంగా జరిగింది. ఆచార్య శివారెడ్డి ఆత్మీయ అతిథులు రింగు రామమూర్తి, డా. అమ్మంగి వేణుగోపాల్, డా. బి.చంద్రశేఖర్‌రెడ్డి, మోతూకూరు నరహరి, టి.గౌరీశంకర్ తదితరులతో కలిసి ఈ తృతీయ ముద్రణ గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రవహించే నది వంటిది ఈ గ్రంథమని అభివర్ణించారు. సభకు పరిషత్తు గౌరవ కార్యదర్శి రింగు రామమూర్తి ముందుగా స్వాగతం పలుకగా నరహరి మాట్లాడుతూ నారాయణరెడ్డి మానవతా సంప్రదాయవాది అన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న దోరణులు గొప్ప గ్రంథమని కొనియాడారు. ఒక గ్రంథం మూడుసార్లు ఆవిష్కరించుకోవడమంటే మామూలు విషయం కాదని అమ్మంగి వేణుగోపాల్ అన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని కొత్త కోణంలో పరిశీలించాలని, చారిత్రక దృష్టితో చూడాలన్నారు. ఈ గ్రంథాన్ని విద్యార్థులు విమర్శనాత్మకంగా అధ్యయనం చేయాలని సూచించారు. నేటి సాహితీ పరిశోధకులకు ఈ గ్రంథం ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు.

## కాలనీ వాసులకు అండగా ఉంటా: జితేందర్‌నాథ్



జితేందర్‌నాథ్‌తో కాలనీ వాసులు

**అల్వాల్, జులై 14 ప్రభాతవార్త:** రామేశ్వర నగర్ కాలనీకి చెందిన సమస్యలు అన్నింటిని దశల వారీగా పరిష్కరిస్తానని మచ్చబొల్లారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. మంగళవారం కాలనీ వాసులు మాజీ కార్పొరేటర్‌ను కలిసి పలు సమస్యలు వివరించారు. రోడ్లు, డ్రైనేజీ పనులు అపరిష్కృతంగా ఉన్నాయని జితేందర్‌నాథ్ దృష్టికి తెచ్చారు. సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులుతో పాటుగా కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ గౌడ్, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు 33 రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలి



**చిక్కడపల్లి జులై 14 (ప్రభాతవార్త) :** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పంపే పోస్ట్‌కార్డులపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుస్తకాల కవిత అధ్యక్షతన జరిగింది. మంగళవారం రాంనగర్ లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు ఈ కీలక సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన స్టేట్ వైస్ ప్రెసిడెంట్ శైలజ హాజరయ్యారు. ఈ సందర్భంగా పుస్తకాల కవిత మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం "నారీ శక్తి వందన్ అధినియమ్ (మహిళా రిజర్వేషన్ చట్టం 106వ రాజ్యాంగ సవరణ) అనే నినాదంతో పోస్ట్‌కార్డుల ద్వారా సంతకాల సేకరణ చేపట్టి, ప్రధాని నరేంద్ర మోదీకి పంపించడం జరుగుతోందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలు, పథకాలను ప్రతి గడప గడపకూ చేర్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా నియోజకవర్గాల అధ్యక్షులు, వార్డు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక మహిళలు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేపు అబిడ్స్ ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర



**హైదరాబాద్, జులై 14,ప్రభాతవార్త:** ఇస్కాన్ అబిడ్స్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో గురువారం 47వ వార్షిక జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 1979 నుండి ప్రతి సంవత్సరం జరుపుకుంటున్న ఈ గొప్ప ఉత్సవంలో జగన్నాథ, బలదేవ, సుభద్రా దేవి దివ్య రథ ఊరేగింపులో పాల్గొనడానికి లక్షకు పైగా భక్తులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎన్‌టిఆర్ స్టేడియం నుండి ప్రారంభమై, ఆర్‌టిసి ఎక్స్‌రోడ్స్, హిమాయత్ నగర్, లిబర్టీ, బషీర్‌బాగ్, అబిడ్స్, ఎంజె మార్కెట్,గాంధీ భవన్ మెట్రో స్టేషన్ మీదుగా 8 కి.మీ సాగి సాయంత్రం 6 గంటలకు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ముగుస్తుందని తెలిపారు. సా. 6 గంటల సాంస్కృతిక ప్రదర్శనలు, జగన్నాథ కథ, ఛప్పన్ భోగ దర్శనం, మహా హారతి కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులందరికీ సజావుగా దర్శనం, ప్రసాద వితరణ సాంస్కృతిక కార్యక్రమాల కోసం విస్తృత ఏర్పాట్లు చేయబడ్డాయని నిర్వాహకులు తెలిపారు.

## అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి వాకిటి శ్రీహరిని పదవి నుంచి తొలగించాలి

**సైఫాబాద్, జులై 14 ప్రభాతవార్త:** ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర మంత్రిగా ఉన్న వాకిటి శ్రీహరి తన పదవులను సక్రమంగా నిర్వహించకుండా కులగజ్జితో ఒక కుల నాయకుడిలా వ్యవహరిస్తూ సాంప్రదాయ మత్స్యకారులైన గంగపుత్రుల పేరును ఉచ్చరించకుండ తన కులమే మత్స్యకార కులంగా మాట్లాడిన ఆయన తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ గంగపుత్ర చైతన్య సమితి డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు మంగిళిపల్లి శంకర్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన కోహెడ్‌లో చేపల ఎగుమతికి మార్కెట్ ప్రారంభోత్సవం సందర్భంగా అసలు, సిసలైన మత్స్యకారుల పేరును ఉచ్చరించకుండా పలు రకాల పనులు చేసుకునే కులం ముదిరాజ్ పేరును ఉచ్చరిస్తూ ప్రభుత్వ కార్యక్రమాన్ని తన కులం మీటింగ్‌గా మార్చుకుని ప్రభుత్వ విలువలను దిగదార్చారని ఆరోపించారు. అంతేకాకుండా గత రెండేళ్ళుగా గంగపుత్ర బిడ్డయిన రాష్ట్ర ఫిషరీస్ ఛైర్మన్‌గా ఉన్న మెట్టు సాయికుమార్ ఈ నెల 7న సాయికుమార్ పదవీ కాలం ముగియగానే రెండు రోజుల్లో ఆగమేఘాలతో మార్కెట్‌కు ప్రారంభోత్సవం చేయించారని, అక్కడ శిలాఫలకంపైనా సాయికుమార్ పేరులేకుండా చేయడానికే మంత్రి ఈ పని చేశారని ఆయన ఆరోపించారు.

ఈ సమావేశంలో సమితి నాయకులు పూస సత్యనారాయణ, రవి, ప్రవీణ్, దుంపల సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చట్ట సభలలో 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి : శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్



పోస్టు కార్డుల ఉద్యమంలో పాల్గొన ్న మహిళా కాంగ్రెస్

**హైదరాబాద్, జులై 14 ప్రభాతవార్త:** ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణక్క సూచనల ప్రకారం మంగళవారం ఆనేక మంది మహిళలు నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో మహిళా ఆ రక్షణ బిల్ ఆజ్ కరో, అబీకరో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఫోన్ ద్వారా, మిస్‌కాల్స్, పోస్టు కార్డులపై సంతకాల సేకరణ, బ్యానర్‌పై సంతకాల సేకరణ నిర్వహించారు. ఇందులో భాగంగా ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ మోసపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఓట్ చోరీ, సీట్ చోరీ, నీట్ పేపర్ చోరీతోపాటు ఆయోధ్యలోని శ్రీరాముడి ఆలయంలో కూడా విరాళాలను చోరీ చేసిన వారున్నారని దుయ్యబట్టారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీలతోపాటు ఓబిసి మహిళలను కూడా చేర్చాలని డిమాండ్ చేస్తూ పోస్టు కార్డులపైన సంతకాల సేకరణ, సెల్ ఫోన్ ద్వారా మిస్ కాల్స్, బ్యానర్‌పైన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ నెల 21న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.సుగుణ, నాయకురాళ్లు మాధవి, వనజ, శాంతి, ప్రసన్నరాణి, విజయలక్ష్మి, అంజలి, ఫరానా బేగం, నాజియా బేగం, అలియాబేగం, రేష్మాబేగం, సునీత, సోనీ తదితరులు పాల్గొన్నారు.

# చిలకలగూడ హత్యకేసులో నిందితుడి రిమాండ్

**సికింద్రాబాద్, జులై 14 ప్రభాతవార్త:** తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో తోటి వర్కర్‌ను పూటుగా మద్యం తాగించి కత్తితో గొంతు కోసి హత్య చేసిన కేసును చిలకలగూడ పోలీసులు చేధించి నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం కతియార్ జిల్లా బహుదూర్‌పురా గ్రామానికి చెందిన అనిల్‌కిస్కు (30) మెట్టుగూడ ఆలుగడ్డబావి వద్ద జరుగుతున్న ఆర్‌యుబీ నిర్మాణపనుల్లో కూలీగా పనిచేస్తు, లేబర్‌క్యాంపులో ఉంటున్నాడు. అనిల్‌కిస్కు భార్య మోహినీ, బీహార్‌కు చెందిన పప్పుసింగ్ (31)లు ఇద్దరు కలిసి ఈనెల 10వ తేదిన ఆలుగడ్డబావి లేబర్‌క్యాంపుకు వచ్చారు. ఇద్దరు కలిసి బీహార్ నుంచి రావడంతో తన భార్య మోహినీ, పప్పుసింగ్‌ల మధ్య అక్రమ సంబంధం ఉందని భర్త అనిల్‌కిస్కు అనుమానం పెంచుకున్నాడు. ఈనెల 11వ తేది మధ్యాహ్నం 12 గంటలకు లేబర్‌క్యాంపులోని తన గదికి పప్పుసింగ్‌ను పిలిచాడు. ఇద్దరు కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో అక్రమ సంబంధం విషయమై ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. అందుబాటులో ఉన్న కూరగాయలు కోసే కత్తితో పప్పుసింగ్‌పై దాడి చేసి గొంతుకోసి హత్య చేసిన అనిల్‌కిస్కు ఏమి ఎరగనట్లు అక్కడి నుంచి జారుకున్నాడు. రక్తపుమడుగులో పడున్న పప్పుసింగ్‌ను తోటి వర్కర్లు గుర్తించి చికిత్స నిమిత్తం గాంధీఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తోటి వర్కర్లతోపాటు నిందితుడు అనిల్‌కిస్కు కూడా ఆస్పత్రికి వెళ్లడంతో అతనిపై ఎవరికీ అనుమానం రాలేదు. ఆర్‌ఎంసీ ప్లాంట్ లేబర్‌క్యాంపు ఉద్యోగి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తన భార్య మోహినీ, పప్పుసింగ్ ఇద్దరు కలిసి రావడంతో వీరి మధ్య అక్రమ సంబంధం ఉందని అనుమానం పెంచుకున్న అనిల్‌కిస్కు హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. హత్యకు ఉపయోగించిన కత్తిని అనిల్‌కిస్కు గది నుంచి స్వాధీనం చేసుకుని నిందితున్ని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి హత్యకేసు మిస్టరీని చేధించిన చిలకలగూడ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించి రివార్డులు అందించారు.

## ప్రజల ఐకమత్యంతో ఉత్సవాలు

### ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ఛైర్మన్ మల్యాల మధుసూదన్ యాదవ్,మందిరం కమిటి ఛైర్మన్ డి.ఆనంద్ గుప్తా

**చార్మినార్, జులై 14 ప్రభాతవార్త :** ప్రజలు కలిసి మెలిసి ఎంతో ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకుంటున్నారని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. పాతబస్తీ దూద్‌బౌలి ఉందాబజార్‌లోని శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా మంగళవారం జరిగిన ఉత్సవాల ప్రారంభం పూజలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బోనాల జాతర ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాత నగరం ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి అధ్యక్షులు మల్యాల మధుసూదన్ యాదవ్, దినేష్, శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయం కమిటి చైర్మన్ ఆనంద్ గుప్తా, ప్రతినిధి వెంకటాచాలంతో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ భవనం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఆనంద్ గుప్తా, బి.సంతోష్, లక్ష్మీ నారాయణ , కె.సత్యం, జి.సుధాకర్, ఎం.బాలేష్, రమేష్, పద్మజ, రాధిక, అరుణ, ఆమణి, లోకపావణి, స్వప్న పాల్గొన్నారు.

## గాంధీ వైస్‌ప్రిన్సిపాల్‌గా బీవీ నాగమోహనరావు



నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

**సికింద్రాబాద్, జులై 14 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ వైస్‌ప్రిన్సిపాల్ (అకడమిక్)గా ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడీ ప్రొ. నాగమోహనరావు నియమితులయ్యారు. ఈమేరకు గాంధీ ప్రిన్సిపాల్ ప్రొ. ఇందిర మంగళవారం నియామక పత్రాన్ని అందించారు. అడకమిక్ వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన ప్రొ. రవిశేఖరరావు బదిలీపై వెల్లడంతో ఆయన స్థానంలో ప్రొ. నాగమోహనరావును నియమించారు. ఈ నియామకంతో మొత్తం ముగ్గురు వైస్‌ప్రిన్సిపాల్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గాంధీ మెడికల్ కాలేజీలో 950 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు, 760 మంది పీజీలు, సుమారు 300 మంది పారామెడికల్, అలైడ్ సైన్సెస్ విద్యార్థులకు వైద్యవిద్యను బోధిస్తున్న నేపధ్యంలో వారికి సంబంధించిన పలు అంశాలను పరిశీలించేందుకు, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని వైస్‌ప్రిన్సిపాల్‌గా నియమితులైన ప్రొ. నాగమోహనరావు వివరించారు. తనకు అవకాశం కల్పించిన గాంధీ ప్రిన్సిపాల్ ప్రొ. ఇందిరకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్స్ ప్రొ. చంద్రశేఖర్, ప్రొ, రాజారామ్, క్రిటికల్ కేర్ హెచ్‌ఓడీ ప్రొ. కిరణ్‌మాదల పాల్గొన్నారు.

## త్యాగరాయగానసభలో పద్య నాటక పోటీలు



రంగస్థల కళాకారులను సత్కరించిన దృశ్యం పీకే

**చిక్కడపల్లి , జులై 14 (ప్రభాతవార్త) :** చిక్కడపల్లి త్యాగాయగానసభలో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నెలవారీ పద్య నాటక పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలలో పలువురు కళాకారులు తమ అద్భుతమైన పద్య నాటక ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం కళాకారులకు శివాని ప్రతిభా పురస్కారాలు అందించి గౌరవించారు. ప్రముఖ రంగస్థల నటులు వై. యస్. చెరువు అప్పయ్య శాస్త్రి, త్రివక్రం వెంకటేశ్వర్లు, వై. సత్యనారాయణ రాజు లకు సంస్థ తరపున ప్రతిష్ఠాత్మక శివాని ప్రతిభా పురస్కారాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన శ్రీ శారద విజయము, శ్రీ రామాంజనేయ యుద్ధము , ఖిక్రణ్ణ సందర్శనంఖి వంటి పద్య నాటకాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. అలాగే గౌతమి మోడల్ స్కూల్, జనగామ విద్యార్థులు ప్రదర్శించిన బాల రామాయణం పద్య నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా గౌతమి మోడల్ స్కూల్స్ డైరెక్టర్ మాతా సురేందర్ రెడ్డి హాజరయ్యారు. గౌరవ అతిథులుగా బి.కె. అరుణ గారు, మాతా సద్గురు మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ సంగీత గురువు, జ్యోతిష్య నిపుణులు, రచయిత, బాలల మయూరి డాక్టర్ జంధ్యాల సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. శివాని ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇమ్మడిశెట్టి శివ సత్యనారాయణ, అధ్యక్షుడు బాపనపల్లి పరమేశ్వర్, సంగీత దర్శకులు సురభి కొండలరావు, హైకోర్టు అడ్వకేట్ పొన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యుత్ లేని ప్రాంతాలు...

**బేగంబజార్, జులై 14 ప్రభాతవార్త:** బేగంబజార్ సిబిడి పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా బుధవారం 11 కెవి విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్‌ఇంజనీర్ అన్నయ్య తెలిపారు. 11 కె.వి.కృష్ణనగర్, గాంధీహన్‌మాన్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 9గంటల 30నిమిషాల నుంచి మధ్యాహ్నం 12గంటల 30 నిమిషాల వరకు హుడా కాలనీ, జిర్రా రోడ్డు, గంజేషాహి దర్గా, మలైమర్, మహబూబ్‌కాలనీ, నటరాజ్, ఐస్ ఫ్యాక్టరీతదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. 11 కెవి టప్పాచబుత్రా, రామ్‌సింగ్ పురావిద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5గంటల 30 నిమిషాల వరకు మెస్కో కాలేజ్, జిర్రారోడ్డు, సనాహోటల్, ఆర్యసమాజ్, ఎంసిహెచ్‌పార్క్, తాళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బేగం బజార్ డివిజనల్ ఇంజనీర్ అన్నయ్య తెలిపారు.




నారాయణగూడాలో ఆర్య వైశ్య సంఘం హిమాయత్ నగర్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం వితరణ చేశారు.కార్యక్రమంలో సభ్యులు లక్ష్మణ్ కుమార్ ,కృష్ణ ,కృష్ణ మూర్తి ,వినయ్ ,రమేష్ , శిరీష్ మరియు భూషణ్ రావు తదితరులు

# 16న ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర ప్రారంభం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

**సైఫాబాద్, జులై 14 ప్రభాతవార్త:** ప్రతి ఏడాది వలే ఈ ఏడాది కూడ హైదరాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా 'శ్రీ జగన్నాథ రథయాత్ర-2026' ఈ నెల 16వ తేదీన అత్యంత వైభవంగా కన్నుల పండువగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఇస్కాన్ కుకట్‌పల్లి బ్రాంచి ప్రతినిధులు తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ రథయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రథయాత్ర నిర్వహణ కమిటీ ఛైర్మన్ అంజనీకుమార్ అగర్వాల్, కుకట్‌పల్లి అధ్యక్షుడు మహర్షి సంఘి దాస్, కో-ఆర్డినేటర్ సఖి రంగదాస్, ప్రతినిధి లహరి తదితరులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 16వ తేదీ సాయంత్రం 3 గంటలకు హైదర్‌నగర్‌లోని పోచమ్మ మైసమ్మ దేవాలయం నుంచి ఈ రథయాత్ర ప్రారంభం జరుగుతుందని, యాత్రను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ప్రారంభిస్తారని, ఇది జెఎన్‌టియు మెట్రో, కుకట్‌పల్లి మెట్రో, వివేకానంద విగ్రహం, బిజెపి కార్యాలయం మీదగా హుడా ట్రాక్ పార్కింగ్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొంటారని హరినామ సంకీర్తనలు ఆలపిస్తారని, అనంతరం రాత్రి 8 గంటలకు హుడా ట్రాక్ పార్కింగ్ ప్రాంగణంలో భక్తులకు మహా ప్రసాదం పంపిణీ జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 19వ తేదీన సికింద్రాబాద్‌లోని క్లాసికల్ గార్డెన్‌లో ప్రత్యేకంగా భక్తీ గీతాల కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ దైవ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీజగన్నాథుడి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



చెత్తను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**అల్వాల్, జులై 14 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ముందుంటామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అల్వాల్, మచ్చబొల్లారం, తుర్కపల్లి తదితర ప్రాంతాలులో ఎమ్మె ల్యే పర్యటించారు. రాజీవ్ వీకర్ సెక్షన్ కాలనీలో పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధా నంగా బస్తీలో గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు శృతిమించుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్యం నిర్వహణ అస్తవ్య స్తంగా ఉందని దుర్వాసనతో సతమతం అవుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, ఎంబిటి మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, శ్రీధర్ గౌడ్ ఇతరులు పాల్గొన్నారు.

### ఆశా, అంగన్ వాడీ వర్కర్లకు గొడుగులు పంపిణీ

రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ సౌజన్యంతో(మాన్సూన్)మిత్ర అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఆశా, అంగన్ వాడీ వర్కర్లకు ఎమ్మెల్యే గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి రోటరీ క్లబ్ ప్రతినిధులు ఇతరులు పాల్గొన్నారు.

### సర్‌పై అప్రమత్తం అవసరం

మచ్చబొల్లారంలో జరిగిన సర్ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగే విధంగా కార్యకర్తలు, నేతలు శ్రమించాలని కోరారు. ఇటీవల పలు రాష్ట్రాలులో సర్ పేరిట లక్షలాదిగా ఓట్లు తొలగించిన విషయం మరువరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేతలు దోలి రమేష్, అనీల్ కిషోర్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండ అమ్మవారికి ఘనంగా ఒడి బియ్యం



బోనాల సందర్భంగా అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమంలో పాల్గొన్న దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** గోల్కొండ బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి ఘనంగా ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నల్లకుంట డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాబిన్ ఆధ్వర్యంలో జరిగిన బోనం ఊరేగింపు కార్యక్రమానికి దూసరి లావన్య శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నేతలు, భక్తులు పాల్గొన్నారు.

### సుచిత్ర రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**పేట్ బషీరాబాద్, జులై 14, ప్రభాతవార్త** పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుచిత్ర ఫ్రెండ్స్ సర్కిల్ రెస్టారెంట్ యూటర్న్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం సుమారు 11:30 గంటలకు హీరో గ్లామర్ బైక్ (టీఎస్08ఎఫ్‌జీ7572)పై సత్య దైవ ప్రసాద్, కడలి దుష్యంత్ ఇద్దరు సుచిత్ర నుంచి తిరుమలగిరి వైపు వెళ్తుండగా, అదే దిశలో వస్తున్న ఐషర్ వాహనం (ఏపీ29వి3764) బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిలియన్ రైడర్ కడలి దుష్యంత్ (31) తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే రష్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మధ్యాహ్నం 12 గంటలకు ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బైక్ నడుపుతున్న సత్య దైవ ప్రసాద్ గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన ఐషర్ వాహన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

### బాచుపల్లిలో గంజాయి ముఠా గుట్టురట్టు..

**కొంపల్లి, జులై 14, ప్రభాతవార్త** గంజాయి విక్రయిస్తున్న ముఠాను బాచుపల్లి పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాజీవ్ గాంధీ నగర్ పరిధిలోని హిల్ కౌంటీ బస్టాప్ సమీపంలోని పార్కు వద్ద పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో భాస్కర్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడిగా ఉండగా, మిగిలిన ఇద్దరు మైనర్లుగా పోలీసులు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి సుమారు 900 గ్రాముల గంజాయితో పాటు ఒక బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ గంజాయిని విశాఖపట్నం జిల్లా సామర్లకోట ప్రాంతానికి చెందిన రాంబాబు అనే వ్యక్తి ద్వారా సుమారు రూ.6 వేలకు కొనుగోలు చేసి, బాచుపల్లి ప్రాంతంలో అధిక ధరకు విక్రయించి లాభాలు ఆర్జించేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

### తండ్రిని చూడడానికి వచ్చి క్రేన్ ఢీకొని యువకుడి మృతి

**సరూర్‌నగర్, జులై 14 ప్రభాతవార్త:** తండ్రిని చూడడానికి వచ్చిన ఓ యువకుడు క్రేన్ ఢీకొట్టడంతో మృత్యువాత పడ్డాడు. ఈ విషాదకర సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కందుకూరు మండలంలోని లేమూరు గ్రామానికి చెందిన భీమయోళ్ళ చిన్నా (22) కూలి పనులు చేస్తూ గ్రామంలోనే తన సోదరి పద్మ వద్ద ఉంటున్నాడు. అయితే బాలాపూర్ ప్రాంతంలో ఉంటున్న తన తండ్రిని చూడడానికి లేమూరు నుండి వచ్చాడు. అయితే మంగళవారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో టీ తాగి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో మల్లాపూర్ వైపు నుండి బాలాపూర్ చౌరస్తా వైపు వస్తున్న ఓ క్రేన్ (టిజి 11బి 3130) ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన చిన్నాను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నా మృతి చెందాడు. దీంతో మృతుని సోదరి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

**చార్మినార్, జులై 14 ప్రభాతవార్త :** పాతబస్తీ కబూతర్ ఖానాలో పడి ఉన్న గుర్తు తెలియని ఓ యువకుడి మృత దేహాన్ని హుస్సేనీఆలం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.....పాతబస్తీ కబూతర్ ఖానాలోని మహేశ్వరీ విద్యాలయం గేటు వద్ద గుర్తు తెలియని ఓ యువకుడి మృత దేహం పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీలో భద్ర పరిచాడు. గుర్తు తెలియని యువకుడి దేహంపై డార్క్ ఫింక్, బ్లాక్ డార్ట్ బట్టలు ఉన్నాయి. జుత్తు పొడవుగా ఉంది. ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### కారు డోర్ తెరవడంతో వాహనదారుడికి తీవ్ర గాయాలు

**జూబ్లీహిల్స్, జులై 14, ప్రభాతవార్తః** పంజాగుట్ట నాగార్జున సర్కిల్ సమీపంలో ఒక కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు డోర్ తెరవడంతో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 4న సంతోష్ తన ద్విచక్రవాహనం (టీఎస్13 ఈఎస్9917)పై అమీర్‌పేట్ నుంచి బంజారాహిల్స్ వైపు వెళ్తుండగా, పంజాగుట్ట నాగార్జున సర్కిల్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన టయోటా ఇన్నోవా కారు ముందు డోర్‌ను ఆకస్మికంగా తెరిచారు. దీంతో బైక్ కారు డోర్‌ను ఢీకొని సంతోష్ రోడ్డుపై పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రమాదం అనంతరం కారు డ్రైవర్, అందులో ఉన్నవారు బాధితుడికి సహాయం చేయకుండా అక్కడి నుంచి పారిపోయారు. అంబులెన్స్ ద్వారా సంతోష్‌ను ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రీకర ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బామ్మర్ది ఫిర్యాదు మేరకు పోలీసులు బీఎన్‌ఎస్ సెక్షన్లు 125, 125(ఎ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రజా ఆస్తుల ధ్వంసం.. వేర్వేరు కేసులు నమోదు

**జూబ్లీహిల్స్, జులై 14, ప్రభాతవార్తః** ప్రజా ఆస్తుల ధ్వంసం కేసులో బంజారాహిల్స్, ఖైరతాబాద్ ఠాణాల్లో రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఖైరతాబాద్‌లోని వీవీ విగ్రహం సిగ్నల్ సమీపంలోని వెర్టికల్ గార్డెన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మొక్కల కుండీలు, ఫ్రేములు ధ్వంసమయ్యాయి. జూలై 12 రాత్రి సుమారు 11 గంటల సమయంలో టీఎస్13 ఈవీ 7298 నంబర్ గల కారు నిర్లక్ష్యంగా నడిపిన మహమ్మద్ ముజ్జదీద్ వెర్టికల్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన మొక్కల కుండీలు, ఫ్రేములను ఢీకొట్టాడు. ఈ సంఘటనపై జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా సాయి కిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు బీఎన్‌ఎస్ సెక్షన్లు 125(ఎ), 281 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1/4 యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసుల గొడుగును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ధ్వంసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ట్రాఫిక్ కానిస్టేబుల్ జి. శివప్రసాద్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

### బంజారాహిల్స్‌లో సిగరెట్లు ఇవ్వలేదని దాడి

**జూబ్లీహిల్స్, జులై 14, ప్రభాతవార్తః** సిగరెట్లు ఇవ్వలేదనే కారణంతో ఓ కారు డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి బెదిరించిన ఘటన బంజారాహిల్స్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రోడ్డు నంబర్ 13లో నివసిస్తున్న బట్టు విజయ్ (33) ఆదివారం అర్ధరాత్రి ఇంటి బయటకు వెళ్లిన సమయంలో పూజారి సాయికుమార్, బిట్టు అనే ఇద్దరు వ్యక్తులు అతడిని అడ్డగించి అదనపు సిగరెట్లు ఇవ్వాలని కోరారు. తన వద్ద సిగరెట్లు లేవని చెప్పడంతో ఆగ్రహించిన వారు చంపేస్తామని బెదిరించి దాడికి దిగారు. అతనిపై పిడిగుద్దులు కురిపించగా, మరొకరు చేతులతో కొట్టినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మోడలింగ్ సంస్థ యజమానిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జులై 14, ప్రభాతవార్తః** మోడలింగ్ శిక్షణ పేరుతో మోసానికి పాల్పడి, అసభ్యంగా ప్రవర్తించాడంటూ స్కై మోడలింగ్ ఇన్‌స్టిట్యూట్ యజమాని సలీమ్‌పై ఓ యువతి ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. రోడ్డు నంబర్10లోని స్కై మోడలింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో మోడలింగ్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మించి సలీమ్ బాధిత యువతి(21) నుంచి రూ.35 వేల ఫీజు వసూలు చేశాడు. జూలై 11, 12 తేదీల్లో జరిగిన తరగతుల సమయంలో తనతో అసభ్యంగా ప్రవర్తిస్తూ అనుచితంగా తాకడం, అసభ్య వ్యాఖ్యలు చేయడం, "అడ్జస్ట్ కావాలి" అని ఒత్తిడి తీసుకొచ్చాడు. దీనిపై ప్రశ్నించి ఫీజు తిరిగి ఇవ్వాలని కోరగా, సలీమ్ డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డాడని యువతి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డుపైనే ఉరివేసుకున్న వ్యక్తి...

**మెహిదీపట్నం, జులై 14, ప్రభాతవార్త :** గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో రోడ్డుపైనే వైరుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెహిదీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ మల్లేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి మంగళవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో మెహిదీపట్నం వైపు నడుచుకుంటూ వస్తూ మాసబ్ ట్యాంక్ బ్రిడ్జి ఎన్ఎండిసి సమీపంలోని వైరుకు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు గల గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ఉరేసుకున్న వ్యక్తిని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే వ్యక్తి ఎవరన్నది ఇంకా తెలియ రాలేదు.

## ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



**తుర్కయంజాల్, జూలై 14 (ప్రభాతవార్త)**
అబ్దుల్లాపుర్మెట్ మండలం తొర్రూర్ డివిజన్ పరిధిలోని ఇంజాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ చర్యల్లో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు.ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 126లోని ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన అధికారులు, అబ్దుల్లాపుర్మెట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జేసీబీ యంత్రం సహాయంతో కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆక్రమిత ప్రాంతాన్ని పూర్తిగా ఖాళీ చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అధికారులు తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఆక్రమణలను గుర్తించి దశలవారీగా తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి: కిషన్



**తుర్కయంజాల్ జులై 14,ప్రభాతవార్త**
కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 15వ తేదీన హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాలో యువకులు నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు ఇంజాపూర్ ఆరోగ్య సంజీవిని పార్కులో ఎస్సై కానిస్టేబుల్స్ మరియు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న యువకులు నిరుద్యోగులకు కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్ మాట్లాడుతూ ప్రపంచంలోనే నేడు భారతదేశంలో అత్యధిక యువసేన కలిగిన దేశంగా ఉంటూ యువశక్తి సామర్థ్యాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించుకోవడంలో పాలకులు విఫలమయ్యారని నిరుద్యోగ కోరల్లో చిక్కిన యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతున్నదని ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని అన్నారు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర బిజెపి ప్రభుత్వం తమ హామీని నిలబెట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 10 లక్షల పైగా ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేంతవరకు నిరుద్యోగ యువతీ యువకులకు నెలలకు ఐదువేల రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వాలని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండరును విడుదల చేసి యూత్ డిక్లరేషన్ హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆరెట్ల మాధవరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

## పేదల ఆకలి తీర్చడంలో సంతృప్తి : శ్రీకాంత్ రెడ్డి



ఉషోదయ కాలనీలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం...

**కుషాయిగూడ, జూలై 14,ప్రభాతవార్త :**
దైవ కార్యక్రమాల పేరిట నిరుపేదల ఆకలి తీర్చడంలో ఎంతో తృప్తి లభిస్తుందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సంఘ సేవకులు, పలు ఆలయాల నిర్మాణ కర్త బుచ్చన్న గారి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శుభోదయ నగర్ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 700 మందికి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా అమ్మవారి ఆలయం వద్ద నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రతినెల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నదాన నిర్వహిస్తున్నామన్నారు. ఎంతోమంది నిరుపేదలు అత్యంత భక్తితో తమ ప్రసాదాన్ని స్వీకరించడం అదృష్టం అన్నారు. అన్నదానం మహాదానమని గుర్తించి తన వితరణ కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కంచుకట్ల మల్లేష్ వంశారాజ్ ,స్కెటరీ కృష్ణ చారి, ఆలయ కమిటీ అధ్యక్షులు చెంచు రెడ్డి , ఆలయ కమిటీ స్కెటరీ నందాచారి, నరసింహ చారి,ప్రతాప్ రెడ్డి, వెంకటాచారి,లక్ష్మణ్‌గౌడ్ మల్లేష్,మైలారం బాల నరసింహ పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ కళ్యాణ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



పత్రిక ఆవిష్కరణలో మాజీ కార్పొరేటర్, ఆలయ కమిటీ ప్రతినిధులు

**హయత్ నగర్, జులై 14 ప్రభాతవార్త :**
హయత్‌నగర్ మండల కార్యాలయ ఆవరణలోని శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆగస్టు 11న నిర్వహించనున్న కళ్యాణ మహోత్సవానికి సంబంధించి ఆహ్వాన పత్రికను మంగళవారం హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తి భావాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో హయత్‌నగర్ గ్రామ పెద్ద కళ్లెం శంకర్ రెడ్డి గారు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చెన్నగౌని శ్రీధర్ గౌడ్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పారంద స్వామి, మాజీ అధ్యక్షులు ఎర్ర రవీందర్, అధ్యక్షులు క్యాదాస్ సతీష్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పిట్టల జంగం ముది రాజ్, పారంద అరవింద్ పాల్గొన్నారు

## జక్కిడిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలి : బిసి సంఘాల నేతలు



ఎల్బీ నగర్‌లో ఆందోళన చేస్తున్న బీసీ నాయకులు

**మన్సూరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:**
యాదవ మరియు గౌడ కులస్థులను అధికార మదంతో దూషించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి లను వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని పలు బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎల్బీ నగర్ లోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్య గౌడ్ తో పాటు వివిధ బీసీ సంఘాల నాయకులు బీసీ ల పట్ల జక్కిడి కుటుంబ సభ్యులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగ బీసీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ లో బీసీ లకు సముచిత న్యాయం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్తుంటే మరో పక్క యూత్ అధ్యక్షుడు మాత్రం అందుకు భిన్నంగా బీసీ లపై హద్దు అదుపు లేకుండా దూషించడం ఎంత వరకు సబబని వారు ప్రశ్నించారు. అగ్రకుల అహంకారంతో బీసీ ల పట్ల వారు చేసిన వ్యాఖ్యలు పై కాంగ్రెస్ అధిష్టానం వెంటనే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా జక్కిడి కుటుంబాన్ని వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని లేకపోతే బీసీ ల ఐక్యత తో కార్యాచరణ చేపట్టి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. అనంతరం ఆందోళన చేస్తున్న బీసీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని అక్కడి నుండి తరలించారు. ఈ నిరసన కార్యక్రమం లో నాయకులు వట్టె జానయ్య యాదవ్, దుర్గయ్య గౌడ్, నగేష్, మల్లేష్ గౌడ్, ముద్దగౌని జగన్ గౌడ్, వెంకన్న గౌడ్, వెంకటేష్ గౌడ్, లింగాల రాహుల్ గౌడ్, ఉపేంద్ర యాదవ్, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి : రాజస్థాన్ ఎంపి అల్కా గుర్జార్



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రాజస్థాన్ ఎంపి అల్కా గుర్జార్, బిజెపి భాగ్యనగర్ జిల్లా ఓబిసి మోర్చ అధ్యక్షుడు చందు ప్రదీప్ కుమార్, లింగాల హరి గౌడ్ తదితరులు

**మలక్ పేట, జూలై 14, ప్రభాతవార్త:**
ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజస్థాన్ ఎంపి అల్కా గుర్జార్ పేర్కొన్నారు. మలక్ పేట నియోజకవర్గం అక్బర్ బాగ్ లో భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ ఆధ్వర్యంలో బిఎల్ఎలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ పేర్లను ఓటర్ లిస్ట్ లో నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పలు రాష్ట్రాల్లో చురుకుగా జరుగుతోందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ముఖ్యమైనదని, ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తమ పేరు తప్పనిసరిగా జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. తమ పేర్లతో పాటు కుటుంబంలోని ప్రతి సభ్యుల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వినియోగించుకుని ఓటర్లు తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. బిజెపి పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. భాగ్య నగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, భాగ్యనగర్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు చందు ప్రదీప్ కుమార్ లు మాట్లాడుతూ మలక్ పేట్ నియోజకవర్గంలోని ప్రజలకు ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తున్నమ్మని తెలిపారు. గ్రేటర్ పరిధిలో బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, ఎస్ఐఆర్ ఇన్చార్జి శశిధర్ రెడ్డి, సంరెడ్డి సురేందర్ రెడ్డి, లింగాలహరి గౌడ్, పండరినాథ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో బిజెపి కేంద్ర ప్రతినిధుల బృందం పర్యటన



సమావేశంలో ప్రసంగిస్తున్న బిజెపి జాతీయ కార్యదర్శి, ఎంపి డా.అల్కాసింగ్ గుర్జార్, మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్, బేతి తదితరులు

**రామంతాపూర్, జూలై 14 ప్రభాతవార్త :** రామంతాపూర్ లోని పలు ప్రాంతాల్లో మంగళవారం బిజెపి జాతీయ కేంద్ర ప్రతినిధుల బృందం పోలింగ్ కేంద్రాల పరిశీలించారు. రామంతపూర్ నెహ్రూ నగర్ కాలనీకి విచ్చేసిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యురాలు డాక్టర్ అల్కా సింగ్ గుర్జార్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు పలు ప్రాంతాల్లో పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ శక్తి కేంద్రం ఇంచార్జీగా ఉన్న పోలింగ్ కేంద్రాలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి డాక్టర్ అల్కా సింగ్ గుర్జార్‌తోపాటు, రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ కుమార్, మాజీ కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డా.మేకల శిల్పారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. అల్కాసింగ్ గుర్జార్ మాట్లాడుతూ సర్ ప్రక్రియ విజయవంతం చేసేందుకు బిజెపి నేతలు కృషి చేయాలని, ఓటరు జాబితాలలో పేర్లు ఉండే విధంగా బిజెపి నేతలు సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. బిజెపి నేతలతో సమావేశమైయ్యారు. పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఓబీసీ నాయకులు వేములకొండ సోమశేఖర్ గౌడ్, హబ్సిగూడ డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు చింతకింది ప్రవీణ్, చెల్లోజు ఎల్లా చారి, నోముల శాంతి కుమార్, వెంకటేశ్వర్లు, పి వెంకన్న, పూజారి సోమయ్య, గోల్డ్ వెంకటేష్, హరిబాబు, అరవింద్, మాల కొండ రెడ్డి కల్మకళ్ళ లింగం, అంజయ్య పటేల్, నాసు సతీష్ పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## పేదలకు ఆసరాగా కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకం : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మైనారిటీ మహిళకు షాదీ ముబారక్ చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ పథకం నేడు వేలాది కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నదని బిఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నాయకురాలు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్, జల్‌పల్లి సర్కిళ్ళకు చెందిన పలువురు లబ్దిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం పహాడీషరీఫ్ బైపాస్ రోడ్డులోని ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా హాజరైన సబితారెడ్డి ఆయా సర్కిళ్ళలోని వివిధ డివిజన్లకు సంబంధించిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడ బిడ్డల పెళ్ళిళ్ళకు ఆర్థిక భరోసా కల్పించాలనే సదుద్దేశ్యంతో కెసిఆర్ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేశారని గుర్తు చేశారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఈ పథకానికి సంబంధించిన చెక్కుతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని ప్రజలకు హామీనిచ్చిందని ఆమె తెలిపారు. అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా నేటికీ ఆ హామీని నెరవేర్చలేదని ఆమె విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని తులం బంగారం హామీని వెంటనే అమలు చేయాలని సబితారెడ్డి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల తహసీల్దార్ ఇందిరాదేవి, జల్‌పల్లి, బడంగ్‌పేట్ సర్కిళ్ళలోని ప్రాంతాలకు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్, ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు, మైనారిటీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌పై అల్కాసింగ్ గుర్జార్ ఆరా



ఎస్ఐఆర్ అమలును పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యురాలు, బిజెపి జాతీయ కార్యదర్శి అల్కాసింగ్ గుర్జార్

**సరూర్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై రాజ్యసభ సభ్యురాలు, జాతీయ బిజెపి కార్యదర్శి అల్కా సింగ్ గుర్జార్ ఆరా తీశారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా మంగళారం ఆమె మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి సర్కిల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాజీ మంత్రి, ఎస్ఐఆర్ జోనల్ బిజెపి ఇంఛార్జి మర్రి శశిధర్‌రెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ తదితరులతో కలిసి జల్‌పల్లి గ్రామంలోని ఎస్ఐఆర్ కేంద్రాలు, హెల్ప్ డెస్కలను సందర్శించారు. ఈ మేరకు ఆమె అక్కడి బిఎల్ఓలు, బిఎల్ఎలతో మాట్లాడి ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఓటర్ల స్పందన గురించి ఆరా తీశారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సమీక్ష జరిపి దిశా నిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యదర్శులు కొప్పు బాష, టి.రవి, జిల్లా ఎస్ఐఆర్ కన్వీనర్ మల్లారెడ్డి, నియోజకవర్గ బిజెపి బిఎల్ఏ-1 ఆందోజి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రామంతాపూర్ పెద్ద చెరువులో హైడ్రా కూల్చివేతలు



రామంతాపూర్ పెద్ద చెరువులో నిర్మాణాలు కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు దృశ్యం.

**రామంతాపూర్, జూలై 14 ప్రభాతవార్త :** రామంతాపూర్ పెద్ద చెరువులో మంగళవారం హైడ్రా అధికారులు పురాతన నిర్మాణాలు కూల్చివేశారు. పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్న పురాతన భవనంతోపాటు, పలు షెడ్లు అధికారులు కూల్చివేశారు. రూ.19 కోట్ల వ్యయంతో రామంతాపూర్ పెద్ద చెరువును అధికారులు సుందరీకరణ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే చెరువు పక్కన కొన్ని సంవత్సరాల నుంచి సగం వరకు కట్టిన పురాతన భవనం అలాగే ఉండిపోయింది. చెరువు సమీపంలో ఉండడంతో అధికారులు మంగళవారం జెసిబిల సహాయంతో నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. హైడ్రా ఎసిపి ఉమా మహేశ్వర్‌రావు, ఎస్ఐ ముజఫర్ తదితరులు అక్కడే ఉండి పరిస్థితి సమీక్షించారు. చెరువు ఎఫ్‌టిఎల్ ప్రజలు నివాసం లేని వాటిని స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. చెరువులో స్థలాలు కోల్పోయే వారికి ప్రభుత్వం టిడిఆర్ చెల్లిస్తుందని తెలిపారు. కూల్చివేతల సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చెరువు సమీపంలోని పలు ప్లాట్ల యజమానులు అక్కడికి చేరుకుని పరిస్థితి గమనించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూల్చివేతలు చేపట్టారు.కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీజగన్నాథస్వామి రథయాత్ర హరినామ సంకీర్తన



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 14 ప్రభాతవార్త:**
శ్రీజగన్నాథస్వామి రథయాత్ర కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ హరినామ సంకీర్తన ద్వారా ముమ్మర ప్రచారాన్ని చేపట్టారు. ఈ నెల 19న జరిగే శ్రీజగన్నాథస్వామి రథయాత్ర ప్రచారార్థం ఇస్కాన్ కోతపేట భక్తి కుటీర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కోతపేటలో నగర హరినామ సంకీర్తన నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోనిఅష్టలక్ష్మి దేవాలయం నుంచి ప్రచార సంకీర్తన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సంకీర్తనలో భక్తులు మృదంగం, కరతాళాలతో హరేకృష్ణ మహామంత్రాన్ని ఆలపిస్తూ ప్రజలకు రథయాత్రకు ఆహ్వానం పలికారు. శ్రీనివాస్ అతిప్రియదాస్, నృసింహ కీర్తనదాస్ పర్యవేక్షణలో, రాష్ట్ర నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి సహకారంతో నిర్వహించారు. శ్రీజగన్నాథస్వామి రథయాత్రలో పాల్గొని భగవంతుని ఆశీర్వాదాలు పొందాలని నిర్వాహకులు ప్రజలను ఆహ్వానించారు.

## దేవాలయ అభివృద్ధికి కృషి: ఛైర్మన్ బాబు శ్రీనివాస్



మలక్ పేట శ్రీ పోచమ్మ దేవాలయంలో హుండి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం, చిత్రంలో ఛైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ చౌకి రవికుమార్, దేవాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ సురేఖ, రాము తదితరులు

**మలక్ పేట, జూలై 14, ప్రభాతవార్త:**
మలక్ పేట లోని శ్రీ పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని ఛైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ చౌకి రవికుమార్ లు పేర్కొన్నారు. శ్రీ పోచమ్మ దేవాలయంలో మంగళవారం హుండి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుండి లెక్కింపు కార్యక్రమంలో రూ. 1,77,512 నగదు ఉన్నట్లు తెలిపారు. ప్రతినెల దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. రానున్న బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దేవాలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ సురేఖ, రాము, కమిటీ సభ్యులు తాటికొండ శ్యామ్, బాలరాజు గౌడ్, లక్ష్మణ్ గౌడ్, కృష్ణ వీరమని,గీతాభాయ్, శ్రీదేవి పాల్గొన్నారు.

## వికలాంగుల సంక్షేమం శాఖ ఛైర్మన్ పదవిని కేటాయించాలి : బొబ్బల రవీందర్ రెడ్డి

**మలక్ పేట, జూలై 14, ప్రభాతవార్త:**
వికలాంగుల సంక్షేమం శాఖ ఛైర్మన్ పదవిని తనకు కేటాయించాలని సినియర్ కాంగ్రెస్ నాయకులు బొబ్బల రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంకోసం తాను ఎంతో కష్టపడ్డానని తెలిపారు. కావున వికలాంగుల సంక్షేమ శాఖ ఛైర్మన్ గా తనకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు విన్నవించుకుంటున్నానని వివరించారు. తాను చిన్నప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతూ వచ్చానని తెలిపారు. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త వారికి అవకాశం కల్పించి తనకు వికలాంగుల సంక్షేమం శాఖ ఛైర్మన్ పదవిని కేటాయించాలని కోరారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తూ, పనిచేస్తూ కష్టపడ్డ కార్యకర్తగా గుర్తించి నాకు ఈ ఒక్క చిన్న అవకాశం ఇవ్వగలరని కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విన్నవించుకుంటున్నట్లు తెలిపారు.

## ఆట స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 14 ప్రభాతవార్త:** బైరామల్‌గూడలోని ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేసిన ఆట స్థలాన్ని ఎల్బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఆట స్థలంలో ఏర్పాటు చేసిన ఎల్ఇడి, హైమాస్ట్ లైటింగ్‌కు వెంటనే కనెక్షన్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాత్రి సమయంలో కూడా సురక్షితంగా ఆటలు ఆడుకునేలా లైటింగ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఆటస్థలం అభివృద్ధికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. విరిగిపోయిన క్రీడా పరికరాలకు వెంటనే తగిన మరమ్మత్తులు చేయిం చాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్బినగర్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్ పాల్గొన్నారు.

## అర్హులంతా 'సర్'లో నమోదు చేయించుకోవాలి



టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు 'సర్' గురించి వివరిస్తున్న ఏఎంసి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, జులై 14 ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను సోమవారం గాంధీభవన్‌లో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ కలిసారు. ఈ సందర్భంగా నగర వ్యాప్తంగా చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం గురించి టిపిసిసి అధ్యక్షుడికి కోట్ల శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి



హైడ్రా కమిషనర్ రంగనాద్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 14 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాద్‌ను కలిసి విన్నవించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని నాచారం పటేల్‌కుంట చెరువు,రామంతాపూర్ చిన్న చెరువులో విస్తృతంగా పెరిగిన గుర్రపు డెక్క కారణంగా దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే చెరువులను శుభ్రపరిచి గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. అదేవిధంగా ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని చెరువుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, చెరువుల సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువుల సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ స్టేజ్‌లను ఏర్పాటు చేయాలని, తద్వారా స్థానిక ప్రజలు, వృద్ధులు ఆరోగ్యకరమైన వాతావరణంలో నడకకు అవకాశం కల్పించడంతో పాటు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుంటుందని వివరించారు. ప్రజలకు మేలు చేకూరే ఈ అభివృద్ధి పనులపై తక్షణ చర్యలు తీసుకుని సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐబిఎఫ్ జాతీయ కార్యదర్శిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, జూలై 14 ప్రభాతవార్త:**
ఆల్‌ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ (ఏఐబిఎఫ్) సంస్థాగత బలోపేతం, దేశవ్యాప్తంగా బ్రాహ్మణుల సంక్షేమం లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన సీనియర్ బ్రాహ్మణ నాయకులకు జాతీయ కార్యవర్గంలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ నేషనల్ సెక్రటరీ జనరల్ ద్రోణంరాజు రవికుమార్ పేర్కొన్నారు. ఏఐబిఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షులు ఎస్.డి.శర్మ ఆదేశాల మేరకు జాతీయ కార్యదర్శిగా వక్కలంక శ్రీనివాసరావు, జాతీయ ఉపాధ్యక్షుడిగా చింతపల్లి మంగపతిరావును నియమించి వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు రవికుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఏఐబిఎఫ్ ఉద్యమాత్మకంగా పనిచేస్తుందన్నారు. విద్య, ఉపాధి, వ్యాపారాభివృద్ధికి తోడ్పడే విధంగా రూ.25 వేల కోట్ల జాతీయ బ్రాహ్మణ సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరారు. నవంబర్ 14, 15 తేదీలలో హైదరాబాద్ వేదికగా ఏఐబిఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కాగా తమపై విశ్వాసం ఉంచి జాతీయ స్థాయి బాధ్యతలు అప్పగించిన ఏఐబిఎఫ్ నాయకత్వానికి జాతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, జాతీయ ఉపాధ్యక్షుడు చింతపల్లి మంగపతిరావు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ సమాజ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కోశాధికారి తిప్పావచుల నారాయణ శర్మ, విష్ణుకాంత్ శ్రీకాంత్, జాతీయ కార్యదర్శి వారణాసి వంశీ, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ, ప్రముఖ బ్రాహ్మణ నాయకుడు దుద్దు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

**వనస్థలిపురం. జూలై.14.ప్రభాతవార్త.**
వనస్థలిపురం పనామ చౌరస్తా సమీపంలో ఈనెల 12 గుర్తుతెలియని వ్యక్తి కేసులో పోలీసులు ఇద్దరు వ్యక్తుల ను అదుపులోకి తీసుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తి జేబులో డబ్బున్నాయని గమనించి అతనిని బండరాయి తో తలపై మోది హత్యచేసి అతని జేబులో వెయ్యి రూపాయలు,సెల్ ఫోన్ తీసుకుని పారిపోయారు.గుర్తుతెలియని వ్యక్తి హత్య గా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలుపెట్టారు .సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు.నిందితులు ఆటోనగర్ కు చెందినవారని తెలిసింది. శ్రీ రాములు పాతనేర స్తుడు.శనివారం రాత్రి సుష్మ థియేటర్ సమీపంలోని కల్లు కాంపౌండ్ లో కల్లు తాగాడు.అక్కడినుండి సమీపంలోని వైన్స్ షాపుకు వెళ్లి ,మిత్రుడైన నర్సింహ(భద్రుడు)ను కలిసాడు.అక్కడే ఓ వ్యక్తి మద్యం తాగి పడిపోయాడు.అతని జేబులో డబ్బు ఉందని గమనించిన శ్రీరాములు, నరసింహ లు అతడిని వెంబడించారు.ఆ వ్యక్తి పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి నిద్రపోయాడు.అతని జేబులో వెయ్యి రూపాయలు,సెల్ ఫోన్ తీసుకున్నారు.అతడు లేవడంతో ముగ్గురి మధ్య గొడవ జరిగింది.అతడు అరుస్తాడేమోనని ఇద్దరు కలిసి బండరాయి తో తలపై మోది పరారయ్యారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు నేరస్తుల ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటి తాళం పగులగొట్టి చోరీ

**హయత్ నగర్, జులై 14 ప్రభాతవార్త :**
ఇంటి త్నాళ పదులగొట్టిన దుండగులు ఇంటిలోని బంగారు వెండి ఆభరణాలను అపహరించుకు పోయిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... పెద్ద అంబర్పేట సదశివా హెవెన్స్ విల్లా నెంబర్ 177 లో నివాస ముండే నెనుముల విజయ 2026 ఫిబ్రవరి 10న అమెరికా లో ఉండే పిల్లల వద్దకు వెళ్ళింది. మంగళవారం ఉదయం ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించిన కాలనీ అసోసియేషన్ ప్రతినిధి మలక్ పేట లో నివాసముండే ఆమె సోదరుడు మురళీధర్ రెడ్డి కి సమాచారం అందించారు. ఆయన ఇంటికి వచ్చి పరిశీలించి చూడగా మొదటి, రెండవ అంతస్థులోని బీరువాలు తెరిచి ఉన్నాయి. తన సోదరికి ఫోన్ చేసి మాట్లాడగా... ఆమె చెప్పిన మాట ప్రకారం సుమారు 2 తులాల బంగారు ఆభరణాలు, కొన్ని వెండి వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులు అపహరణకు గురయినట్లు గుర్తించారు. మురళీధర్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాలాపూర్‌లో ఫారాలు పూరించడంలో ఓటర్లకు సాయం

**సరూర్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని బాలాపూర్ డివిజన్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాలు పూరించడంలో ఓటర్లకు స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు బాల్‌నింగని జంగయ్య సహాయ సహకారాలు అందించారు. బూత్ నెంబర్ 370లో ఆయన ఎన్యూమరేషన్ ఫారాలు ఏవిధంగా పూరించాలో తెలియని ఓటర్లను గుర్తించి వారికి సహాయం చేశారు. ఈ మేరకు ఫారాలను తప్పులు లేకుండా పూరించి సంబంధిత బిఎల్ఓలకు సమర్పించారు



ఈ సందర్భంగా పలువురు ఓటర్లు జంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.